కథానిక

# ప్రయాణంలో

చందూరి నాగేశ్వరరావు

ప్రవరు దొరపేరు మీదుగా నలుగురి నోళ్ళల్లో పడ్డ పవర్ పేటలో కలకత్తా మెయిల్ ఆగింది. చేతిలో సెకండ్ క్లాస్ టికెట్ వుంది కాని ఒక్కడూ లోపలికి చోరనివ్వడంలేదు. కార్యభారం! ఆరునూరయినా తెల్లారేటప్పటికి రెక్కలుకట్టుకు పట్నం పోవాలా? కొసాని వున్న ఫస్టుక్లాసులో ఎక్కాను,— నాకంత తాహతులేకపోయినా.

నా ఖంగారుతో బాటు యింతసేపూ వెన్నంటి నడుస్తోంది అమ్మ. సాగనంపేందుకు స్టేషన్‌కి వచ్చింది—మళ్ళీ ఎన్నాళ్ళకి వస్తానో అని. అవును— పెద్దదైన అమ్మని వొదిలి ఎందుకీ మహాప్రపంచంలోకి! ఉన్న వూరూ, పొలం పుట్రా వొదిలి జీవిత జూదంలో కెందుకు? సమాధానంలేని నడక.

రైలు కూతేసింది. "జాగర్త నాయనా" అంది అమ్మ బొంగురు కంఠంతో. అరవైఏళ్ళ జీవిత ప్రవాహం ఈదిన సహనాన్ని చీల్చే మూగ బాధేమిటో ఆ కంఠంలో! "సత్రం భోజనం—మఠం నిద్ర"గా దినాలు తిరగేస్తున్న నేను ఆమెని నా సంరక్షణలో వుంచుకో లేకపోయాను. 'నా'అన్న వాళ్ళమీద తీపి పెద్దవయసులోగాని బోధపడదనుకుంటాను. నేనూ వార్ధక్యంలో యిలానే తపనపడతాను కాబోలు. భవిష్యత్తేమి దాచివుంచిందో—గవ్వల్లో మణులో.

మరుపు రానివిగా మనసులో హత్తుకుపోయే దృశ్యాలలో ఆనాటి వీడ్కోలు ఒకటి. అమ్మ గాజుకళ్ళలో పేరుకొన్న నీటిబొట్లు, ఆమె నెమ్మదినెమ్మదిగా నీడ అయిపోవడం, రాను రాను ప్లాట్‌ఫారంమీద ఒక్క దీపమూ కూడా నలుపై అంధకారంలో ఐక్యమవడం ఆలాగే ద్వారంలో నుంచుని తదేకంగా చూడటం-ఈ నాటికూడా కళ్ళకి కట్టినట్టుంది. నక్షత్రాలూ నిప్పుకణాలూ నా స్వగతాన్ని ఈసడించేదాకా గుమ్మంలోనే వున్నాను.

వెనక్కి తిరిగి ఆత్మీయమైన సిగరెట్ ముట్టించాను. నాలుగు బెర్తులలో ఒకవైపు ఖాళీలేదు. రెండో పక్కనున్న కింద బెర్తుపై నా పక్క పరిచాను.

నాతోటి ప్రయాణీకు లిద్దరు. కింద పడుకుని చదువుకుంటున్నది ఒక స్త్రీ; పై బెర్తుమీద గుర్రుపెడుతూ దోమల్ని హడలెత్తిస్తున్నాడో స్థూలకాయుడు. ఉన్నది యిద్దరేగాని పెట్టెనిండా వాళ్ళ సామానులు పరిచారు. సగంతిన్న 'ద్రాక్షగుత్తి, మూతతీసిన బిస్కట్ల డబ్బా, ఆరుకప్పులు పట్టే కాఫీ పీపాలూ వద్దనుకున్నా ప్రత్యేకంగా దృష్టినరికడ్తాయి. ఇద్దరూ మొగుడూ పెళ్లామో, అన్నాచెల్లెళ్లో—ఏదో ఒక బంధుత్వం—వుండి తీరుతుంది. స్త్రీ చేతిలోవున్న 'టైమ్'పత్రిక ఆమె కాస్తదొక్కశుద్ధిగల మనిషని చెప్తుంది.

రోజులు గడిచినట్టే రైలు నడుస్తోంది. స్టేషనులు దాటి పోతున్నాయి. ఆమె పత్రికలోని పేజీలుకూడా అదే మాదిరిగా తిరిగి పోతున్నాయి.

అరగంట అయినతర్వాత ఆవిడ "బెజవాడ యింకా ఎంత సేపటికి వస్తుంది" అని అడిగింది. నిజానికి బెజవాడ నడిచిరాదు— రైలు బెజవాడ వెళ్తుంది.

"ఇంకో అరగంట" అంటూ ఆమెవంక చూశాను. ఆమె తెలుగుపిల్ల కాదు. తమిళవనిత సూత్రాం కాదు; కన్నడస్త్రీలా లేదు; శరత్ నాయక కానే కాదు. మరి ఎవరు? ఏరాష్ట్ర మీమెది? పంజాబ్ సింధు,గుజరాత్, మరాటా, ద్రావిడ,వుత్కళ,వంగలలో ఏప్రాంత మీమెది? ఈమె నాలుగుగోడల మధ్యా యిమిడే మనిషిలా కనిపించడం లేదు. నవ్య భారత స్త్రీ—దేశమంతా ఈమెదే! పురుషులకి రాష్ట్రాభిమానాలూ, కులమతకక్షలూగాని స్త్రీలకవిలేవు. అందుకే గురుదేవులు 21వ శతాబ్దంలో భారతనారి ప్రపంచ సమస్యలకి వెలుగు చూపి శుభాక్షితలు చల్లగలదని కాంక్షించారు.

పెట్టెలో ముగ్గురం: నిద్రపోయే ఒక విఘ్నేశ్వరుడూ, నిత్య యౌవనంతో తొణికిసలాడే ఒక

సుందర స్త్రీమూర్తి, పాతిక రూపాయలు వృత్తి పుణ్యానికే రైల్వే వాళ్ళకివ్వాలే అని విచారించే నేనూ. వస్తువు ధరకట్టినట్టు, 'అమ్మాయివయసు అం చనావేస్తే 20-25 మధ్య చూపుతుంది. ఆ వయసుగల స్త్రీని అమ్మాయిఅనడం భావ్యం కాదేమో! అయినా 'అమ్మాయి' అనే అంటాను.

"మీరు మద్రాస్‌యేనా" అంది, రాభణాసురుడులా.

ఆమెకేమీ తోచడంలేదు కాబోలు- ప్రయాణ వైశ్యంవల్ల. ఆడవాళ్లు స్వతహాగా మాటలపోగులు అందులో. చదువుకున్న పిల్లలుమరీను. ఇప్పు డీమెకి ఆంధ్రులు మద్రాసీలుకాదని, చెన్నపట్నం మాదే ననీ, నోట్లమీద తెలుగుభాష రాసివున్నా ఈతిక్క నార్య సంతతికి జెందిన శూరులకి రాష్ట్రం అంటూ ఒకటి ప్రాప్తం కాలేదని, విశాలాంధ్రతలో ప్రజా రాజ్యం గురించి మాకు భేష్మైన కల లున్నాయనీ వోభారతం చెప్పాల్సివుంది. అంతచెప్పే వోపిక లేక టూకీగా "అవును" అంటూ, "మీరో" అన్నాను.

"బొంబాయి. మాఅన్నయ్య, చూడండి, అయి దుగంటలకి పడుకున్నాడు— యింతవరకూ ఒకటే నిద్ర. నిద్దర్నుంచి లేపితే మాఅన్నకి పెద్దపులికి వచ్చినంత కోపం వస్తుంది."

"నాకూ అంతే."

"కాని, మాచిన్నన్నకి చీమ చిటుక్కుమన్నా మెలకువ వస్తుంది...మీవైపు మెయిళ్లెప్పుడు లేటు గా నడుస్తా యనుకుంటాను. నిన్న మధ్యాహ్నం హౌరాలో......"

"అయితే, ఇదిమీకు రెండోరాత్రి అన్నమాట."

"మెయిల్లు లేటు కాకపోతే రేపు రాత్రికి మా అత్తయ్యగారివూరు చేరుకుంటాం."

"అదెక్కడ?"

"మీకు దగ్గిరే—బెంగుళూరు."

"మీ రు హౌరానుంచి బెంగుళూరు వెళ తున్నా రా?"

"ఆఁ"—అంది వీణాప్రియంవద కిన్నెరలా. అరగం టలో ఎలావచ్చిందో మా కోరణిలో ఆప్యాయతా, మాటల్లో మాధుర్యమూను. బెజవాడలో వాళ్లన్న నిద్రనుంచే లేచే వేళకి, మేము 'ఫ్రెండ్సు' అయి పోయాం. విఘ్నేశ్వరుడు రైలు కృష్ణాబ్రిడ్జి ఎక్కక పూర్వమే గురక పెట్టాడు.

"మా అన్న రైలు ప్రయాణాలలోనే; విశ్రాం తిగా నిద్రపోతాడు. మిగతావేళల స్తిమితమే వుండదు."

అవును—వాళ్లన్న సామాన్యుడా! సరుకుదాచేసే వాణ్ణి చంపండి—అని పండితనెహ్రూ వెనకన గానే రిలీఫ్‌కమిటీ చందాపట్టీలో తనపేరు మొదట వేయించుకొని పాతికవేలు చెల్లగట్టాడు. వాళ్ల అన్న బహుయోగ్యుడు- ఒకరికి కీడు తలపెట్టడు. అతడు మనుషుల్నేకాక కుక్కల్ని కూడా ఎంతో దయగా చూస్తాడు. ఒకచేతితో కాంగ్రెస్‌కి, మరొకచేతితో బ్రిటిష్‌వారి యుద్ధ నిధికీ సహాయం జేసిన బాప తతను. ముక్తసరిగా మాట్లాడుతాడు. సద్వంశంలో పుట్టాడు. హరిజనో ద్ధరణకి ఎంతో పాటు పడుతున్నాడు. అహమ్మదా బాద్‌లో బట్టలమిల్లులు వున్నాయి. బొంబాయిలో అద్దెలకిచ్చే యిళ్లున్నాయి. షేర్లజూదం జాగర్తగా ఆడగలడు. నిజంగా వాళ్లన్న సత్పురుషుడు.

"అదంతా మీరు త్రికరణశుద్ధిగా నమ్ము తున్నారా?" అన్నాను వీణా ప్రియంవదతో.

"నిస్సంశయంగా నమ్మితే నేనీపాటికి ఆదర్శ గృహిణినై సంఘసేవ చేస్తూ వుండేదాన్ని.'

ప్రియంవద మాటకారి. వాళ్లన్నమీద ఆమెకి అభిమానం తక్కువలేదు. అతనిమీద ఎంతో గౌర వం. అన్నగారు కాపిటలిస్టు— తను సోషలిస్టు. సూత్రప్రాయమైన రాజకీయవిశ్వాసం పురస్క రించుకొని అన్నగార్ని ద్వేషించడం ప్రాచ్యధర్మం కాదంటుంది వీణా.

"వెయ్యి చెప్పండి- లక్ష చెప్పండి. మీ రు కూడా ఒకరకంగా పలాయనసూత్రమే పాటిస్తున్నారు. కారుమబ్బుల్లోకి రాలేని వారికి కాంతిరేఖ ఎలా కనిపిస్తుంది? పుస్తకాల్లో నుంచి పిండినమాటలు మీరు వొప్పజెప్తున్నా రేమో! మీకు సోషలిజంమీద నమ్మకం కుదిరితే..."

"ఫస్టుక్లాసులో ప్రయాణం చెయ్యననేగా!"

"అంత చచ్చుమాట అనను."

"పోన్లెద్దురూ. ప్రపంచ పర్యటనం చేసి, యిం గ్లాండమెరికాలలో చెరో ఆరు నెలలూ గడిపితే గాని, రాజకీయ విశ్వాసాలు నా స్వభావంలో పునాది కట్టుకోలేవు."

వీణా ప్రియంవద మనో వైశాల్యానికి చకితుడ నయాను. పతివ్రతల ఇండియాలో యీమాదిరి స్త్రీ

వుందా? అనుభూతి లేనిదే సిద్ధాంతాన్ని ఆమోదించననే దృఢ నిశ్చయురాలీ ధీరనారి. మలబార్ హిల్ మీదనుంచి సూర్యోదయం చూసినట్టయింది. 'మృచ్ఛకటికం' లోని చారుదత్తుడి పలుకులు జ్ఞాపకం వచ్చాయి.

“కోర్టు సముద్రంలా వుంది; సమాలోచనా సభ్యులు ఆలోచనలో మునిగారు.; వూగిసలాడే కెరటాలే న్యాయవాదులు; అడవిమృగాలు మంత్రులు; తాచుపాము ప్రభుత్వోద్యోగి, నత్తలోని ప్రాణిలా గూఢచారులు; ఎగిరే చేపలు వేగులవాళ్లు; తుపానుతో చిందరవందరైన బీచి (న్యాయం) మాత్రం క్షేమదాయకమా?”

పేదవాళ్లమయిన నాకూ చారుదత్తుడికీ బతుకే ఒక క్షోభ. అంచేత క్షేమమనేది మాకెప్పుడూ దూరపుకొండే.

రైలు ఒంగోలు ప్రమాదం దాటింది. మధుర స్మృతి నా మెదడులో అప్పుడే సాలిగూడల్లుతోంది. ఎవరీమె? ఎందుకు కనిపించిందీరాత్రి! కాకతాళీయ న్యాయంగా సంభవమయే ఘటనలా యివి. ఆనాలుగైదు గంటల్లో మామధ్యఏర్పడ్డ బాంధవ్యం నల్భైఏళ్ళ పరిచయంలో కూడా సాధ్యం కాకపోవచ్చు. స్త్రీపురుష స్వభావసైజమో బుద్ధి విశేషంలోని ఆదర్శసామ్యమో సైకాలజిస్టులు నిర్ణయించాలి.

మాటలు రాక హృదయాలు బీద వయాయి. వెన్నెల పెట్టెలో ఖైదీఅయింది. దీపం ఎప్పుడో ఆర్పేశాం పొగమంచు మమ్మల్ని దీనులుగాచేసి దిగులుపుట్టిస్తోంది.

“ఆంధ్రాలో కమ్యూనిస్ ప్రచారం అమితంగా వుందని వింటూ వుంటాం—— నిజమేనా!” అంది వీణా ప్రియంవద.

“వీణా”

“ఎందుకు కంఠంలో ఆవణుకు?”

“మన పరిచయానికి ఆయుర్దాయమెంతో కొలుస్తున్నాను. అయిదున్నర గంటలు గడిచింది. ఇంకో రెండుగంటల్లో భళ్లున తెల్లారుతుంది, మీరు గూడూరులో దిగిపోతారుగా!”

“గడియారం ముల్లుల్ని నమ్మకండి. మనసుమీద ముద్రవేసే ఈఅనుభవం మనం వున్నంతవరకూ వుంటుంది-”

“కాలం చెరుపుతుంది”

“చెరపలేదు– పదిలంగా లోపలి అరలలోదాస్తుంది.”

పదేపదే పవరుపేట స్టేషనులోని అమ్మగాజు కళ్లు జ్ఞప్తికి వస్తున్నాయి.చెప్పనా ఈమెకి మా అమ్మ గురించి? నిజానికి ఏముంది చెప్పేందుకు! కన్న కడుపుకనక ఆమెకితీపి– రెక్కలొచ్చాయి కనక నేను గూట్లోనుంచి ఎగిరిపోవాలి. అంతే!

చీకటిలో జ్యోతుల్లా మెరుస్తున్నాయి వీణారాణి కళ్లు. రెప్పలా జ్యోతులతో పరాచికాలాడుతున్నాయి. ఆమె స్త్రీ-నేను పురుషుణ్ణి. కాని మేమిద్దరమూ అవ్యక్తమైన ఏక ప్రపంచం కోసం బతుకుతున్నాం. ఆఏక ప్రపంచం ప్రసవవేదననుభవిస్తోంది. మావ్యక్తి సమస్యలు జీవితశక్తి కాళ్ళ ముందు పారేయ్యాలని ఆదర్శధర్మం ప్రబోధిస్తుంది. అవకాశా లున్నాయి కనక ఆమె ప్రపంచ పర్యటన చేస్తుంది. అవకాశాలులేని నేను మద్రాసు ట్రాముల్లో ఒణ్ణెకాలణా టికెట్ మీద గమనంసాగిస్తూ నవయుగ నిర్మాణం గురించి కలలుకంటాను.

ఎవరా వీణాప్రియంవద? ఎందుకు కనిపిస్తారిలాంటి మనుషులు!ఎడారిబతుకులో 'ఒయాసిస్సా?' ఇలాంటి ప్రశ్నలకి సంజాయిషీ మనవివేకంలో దాక్కునివుంది. వీణా ప్రియంవదని మనం ప్రేమించం——పూజిస్తాం. చేతుల్లో యిమడదు,పరిమళంలా ఆవరించుకుంటుంది. కాళిదాసు మాకు కల్పించిన తిరుగుబాటు నాయికల సారాంశం వీణాప్రియంవద. తెల్లారి గూడూరులో దిగుతూ అడ్రసుయిచ్చి నన్ను నెలాఖరులోగా తప్పకుండా బొంబాయి రమ్మనమంది. వాళ్ళన్నకూడా రమ్మనమని మరీ మరీ చెప్పాడు.

ఊహించుకోగలను– వీణా ప్రియంవద భవనం ముందు యిద్దరు దర్వానులు వుంటారు. “కుక్కలు జాగ్రత!” అని బోర్డు వుంటుంది. ఆమెని చూడటానికి ముందు ఎందరిప్రశ్నలకి నేను జవాబు చెప్పుకోవాలో! ఇంతా అయినతర్వాత 'ఫలానా రైల్లో మనం కలుసుకున్నాం' అని ప్రారంభించేదా!

కథలలో శిల్పంకోసం, నీతికోసం పెళ్లిళ్లు చేయించి, పిల్లల్ని కనిపిస్తారు. కాని జీవితానుభవాలు పుటుక్కున తెగుతాయి. ఇంకా వీణాప్రియంవద సంగతి అడుగుతున్నారా? తప్పిపోయిన రైలుకోసం పరుగెత్తేటంతటి మూర్ఖుణ్ణి కాను నేను!